క్లుప్తంగా

ఇసుకలో కూరుకుపోయిన జీప్


ఇసుకలో కూరుకుపోయిన జీప్‌ను బయటకు తీస్తున్న భవానీ భక్తులు

మల్కాపురం: కొంత మంది స్థానిక యువకులు తమ జీప్‌ను మంగళవారం ఉదయం యారాడ బీచ్‌కు తీసుకువచ్చి సముద్రం ఒడ్డున నడిపారు. ఆ వాహనం టైర్లు ఇసుకలో కూరుకుపోవడంతో ఒక్కసారిగా కలవరం పాటుకు గురయ్యారు. ఆ సమయంలో సముద్ర స్నానాలకు వచ్చిన స్థానిక భవానీ భక్తులు 20 నిమిషాల పాటు శ్రమించి ఆ వాహనాన్ని బయటకు తీశారు. దీంతో జీప్‌లో ఉన్న యువత ఊపిరి పీల్చుకుని, భవానీ భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవీఎంసీ ఉద్యోగులకు కమిషనర్ అభినందన


ఉద్యోగులను అభినందిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఉద్యోగులకు ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్‌లో స్థానం దక్కింది. అసోసియేషన్‌లో జీవీఎంసీ సూపరింటెండెంట్ అక్కరబోయిన అప్పలరాజు జనరల్ సెక్రటరీగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మువ్వల రవి కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అసోసియేషన్‌లో స్థానం దక్కించుకున్న జీవీఎంసీ ఉద్యోగులను అభినందించారు. జీవీఎంసీ జెమ్స్ భవనంలో మంగళవారం సాయంత్రం మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు అప్పలనాయుడు నేతృత్వంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వామనరావు ఆధ్వర్యంలో పదవులు పొందిన వారంతా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఐక్యూఏసీ సమావేశ మందిరం ప్రారంభం


సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ)లో నూతన సమావేశ మందిరం(బోర్డ్ రూమ్)ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వివిధ సంస్థల ప్రతినిధులు తరచూ ఏయూ ఐక్యూఏసీ కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వారితో చర్చించడానికి ఉపయుక్తంగా ఆధునిక వసతులతో దీనిని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె.భట్టి, వి.విజయలక్ష్మి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆచార్య డి.లలితభాస్కరి పాల్గొన్నారు.

అర్ధంతరంగా ముగిసిన బోనస్ సమావేశం

ఉక్కునగరం: సెయిల్ కార్మికుల బోనస్ సమావేశం అర్ధంతరంగా ముగిసింది. ఈ ఏడాది సెయిల్ కార్మికులకు బోనస్ చెల్లింపులపై మంగళవారం న్యూఢిల్లీలో ఎన్‌జేసీఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ ఏడాది నుంచి అమలులోకి రానున్న కొత్త ఫార్ములా ప్రకారం రూ. 22,579 ఇస్తామని సెయిల్ యాజమాన్యం ప్రతిపాదించింది. కార్మిక సంఘాలు గతేడాదిలా రూ. 40,500 ఇవ్వాలని డిమాండ్ చేశాయి. దానికి యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో కార్మిక సంఘాల నాయకులు వాకౌట్ చేశాయి.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే సీఎం ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- 59వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం


గోపాలపట్నంలో పరీక్షలు చేసున్న సిబ్బంది


రక్త పరీక్ష చేయించుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్


వైద్య శిబిరానికి హాజరైన మహిళలు

మల్కాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష.. ఇది ఓట్లు కోసం చేపట్టిన కార్యక్రమం కాదు.. మీరంతా ఆరోగ్యవంతులుగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 59వ వార్డు పరిధి ఎక్స్‌సరీస్‌మెన్‌కాలనీ సచివాలయం పరిధిలో వారికి మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ ఇంట్లో ఆనందం,సంతోషం ఉంటుందన్నారు. ప్రతి ఇంట్లో చిరునవ్వులు చూడాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని చెప్పారు. పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వైద్య నిపుణులను పంపించి సేవలందిస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా రాష్ట్ర మంతా వైద్య సిబ్బంది జల్లెడ పడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్యం అందిస్తున్నారని వివరించారు. 250 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ కృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరావు,ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్,ఉమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఉమావతి, నాయకులు కలిదిండి బద్రీనాథ్, క్లస్టర్-2 అధ్యక్షులు అంగ రామ్‌ప్రసాద్,రేవళ్ల సత్యనారాయణ,మాజీ కార్పొరేటర్లు గల్లా శ్రీను,పిల్లా కన్నబాబు,పూండి మల్లేశ్వరరావు,ఆడారి హరీష్,భీశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన శిబిరం

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో రెండోజు మంగళవారం కూడా కొనసాగింది. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పూజ పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్, గైనిక్, పిల్లల వైద్యులు, కంటి వైద్యులు జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, వంటీర్లు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సహాయ సహకారాలు అందించారు.

ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. దంత, గైనకాలజీ, కంటి వైద్య నిపుణుల వద్దకు ఎక్కువ మంది సేవలు పొందేందుకు క్యూ కట్టారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. సచివాలయ సిబ్బంది పేర్లు నమోదు చేసుకుని సమస్యను బట్టి ఆయా వైద్యుల వద్దకు రోగులను పంపించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఉచితంగా ఏర్పాటు చేసిన భోజనాలను వార్డు నాయకుడు నమ్మి శ్రీను తదితరులు శిబిరానికి వచ్చిన వారికి అందజేశారు. రెడ్ క్రాస్ వలంటీర్లు సేవలు అందించారు. బుచ్చిరాజుపాలెం -2 సచివాలయ అడ్మిన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. బుధ, గురువారాల్లో కూడా సెయింట్స్ ఆన్స్ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం కొనసాగుతుందని, 90వ వార్డు ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని నమ్మి శ్రీను కోరారు.


శిబిరానికి వచ్చిన వారి పేర్లు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది


బుచ్చిరాజుపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాగసుధ

మాలాంటి వారికి భరోసా



మా కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు.తీవ్ర నరాల బలహీనత సమస్యతో బాధపడుతున్నాడు.జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మా బాబును వైద్య నిపుణులు పరీక్షించారు. పలు సూచనలు చేశారు. మాలాంటి వారి ఆరోగ్యానికి ఈ కార్యక్రమం భరోసా ఇస్తుంది.

– నాగమణి, ములగాడ హౌసింగ్‌కాలనీ

గుండె,దంత సమస్యలతో వచ్చా..



నాకు కొంత కాలం నుంచి అలసట, దంత సమస్యలు ఉన్నాయి. బయట వైద్యం చేయించుకోవాలంటే వేలాది రూపాయిలు అవసరం. కానీ ఇక్కడ పైసా ఖర్చు లేకుండానే గుండెకు, దంత సమస్యకు ఆయా వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు.అవసరమైన మందులు ఇచ్చారు.

– అబ్దుల్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ

పైసా ఖర్చు లేదు



నేను కొంత కాలం నుంచి గుండెకు సంబంధించిన సమస్యతో పాటు బీపీ, గ్యాస్ ట్రబుల్ తో బాధపడుతున్నాను.పేద కుటుంబానికి చెందిన నేను ఆయా సమస్యలపై వైద్య నిపుణుల వద్దకు వెళ్తే వేల రూపాయిలు పట్టుకోవాలి. కానీ ఇక్కడ పైసా ఖర్చు లేకుండా అన్ని వైద్య సేవలు పొందగలిగాను.

-ఎం.డి.అన్వర్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల చెంతకే ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే శస్త్రచికిత్స కూడా ఉచితంగా నిర్వహిస్తారు.ఇలాంటి మంచి కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ నాంది పలకడం చాలా సంతోషకరం.

– డాక్టర్ సాయిరూప, వైద్యాధికారి

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


నేత్ర వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ జె.శిరీష అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చదువుతున్నప్పుడు కంటి నుంచి నీరు కారడం, దృష్టిలోప సమస్య,తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సుమారు 500 మందికి విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు విస్తృతం


స్టాల్‌ను ప్రారంభిస్తున్న నమ్మి శ్రీను

విశాఖ విద్య: అంగన్‌వాడీల ద్వారా సేవలు విస్తృత పర్చాలని 90వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను అన్నారు. బుచ్చిరాజుపాలెంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించేలా స్టాల్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీలు, సీవోల సేవలను గుర్తిస్తాం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: మహిళా పొదుపు సంఘాలను సక్రమంగా నడిపిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్‌పీలు,యూసీడీ సీవోలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. నక్కవానిపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆర్‌పీలు, యూసీడీ సీవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వంఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని మరి కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. వారిని ఆ విధంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఆర్‌పీలు, సీవోలను కోరారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ అండగా నిలుస్తారన్నారు. వడ్డీ లేని రుణాలు,రుణ మాఫీ దశల వారీగా చేపడుతున్నట్టు వివరించారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, క్లస్టర్-2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్,వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు మాజీ చైర్మన్ ఆల్లా కృష్ణ, పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము),పొట్టిమూర్తి,జీవీఎల్ నరేష్,మళ్ల ధనలత,తోనంగి వెంకటరమణి,చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

కంచరపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 57వ వార్డు కంచరపాలెం పరిధి ఆశవానిపాలెం, 104 ఏరియా శ్యామ్‌నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ఇప్పటి ప్రభుత్వం అందించి సంక్షేమ ఫలాలను వివరించడంతో పాటు బ్రోచర్ అందజేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్రు వాణీ నానాజీ, నాయకులు శ్యామ్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శ్యామ్‌నగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఆనంద్ కుమార్


రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం


మీడియాతో మాట్లాడుతున్న మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత మురళీకృష్ణ

సీతమ్మధార : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత డాక్టర్ వూన మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లలో నిపుణులైన అంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 18 ఏళ్లుగా 8,500 మంది రొమ్ము క్యాన్సర్ బాధితులకు విజయవంతంగా చికిత్సలు చేసినట్టు తెలిపారు. రొమ్ము క్యాన్స ర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. ముందుగా గుర్తించి చికిత్స అందిస్తే న యం అవుతుందన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా ల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలందిస్తోందన్నారు.

అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ


అన్నపూర్ణదేవి అవతారంలో..


అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ


ప్రశాంతినగర్‌లో ..

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రులు సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద దుర్గాదేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మవారికి దద్ధోజనం,అప్పాలు నైవేద్యంగా సమర్పించారు. మల్కాపురం యాదవ వీధి వద్ద విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

- గాజువాక ఆర్టీసీ డిపో వద్ద, జనతాకాలనీ జైదుర్గాదేవి ఆలయం వద్ద,నక్కవానిపాలెం,మల్కాపురం,శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని అమ్మవారి పీఠాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

గోపాలపట్నం: శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడో రోజు మంగళవారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా పూజలు అందుకున్నారు. కొత్తపాలెం దుర్గ గుడిలో సామూహిక పూజలు చేశారు. గోపాలపట్నం ప్రశాంతినగర్ పైడితల్లమ్మవారి ఆలయంలో కళశ పూజలు చేశారు. చంద్రమౌళీశ్వర ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మను కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


పూజలు చేస్తున్న కార్పొరేటర్ రమణ


కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో..

అధ్యాపకులపై గురుతర బాధ్యత


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: పటిష్టమైన బోధన వ్యవస్థతో మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ ఐఏఎస్‌ఈ ప్రాంగణంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య బీఈడీ విద్యార్థుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ ప్రగతికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ బీఈడీ చదివే ప్రతి విద్యార్థికి బోధన విధానాలు, చిన్నారుల మానసిక పరిణితి, సోషియాలజీ, ఫిలాసఫీ వంటి అంశాలను అవగాహన కల్పిస్తామన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొననున్నాయన్నారు. విజేత జట్టుకురూ.10వేలు అందజేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సంతోష్ (ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో పరదేశమ్మ ఆలయం సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఆదర్శనగర్‌కు చెందిన దేవి సంతోష్(38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. సంతోష్ ద్విచక్ర వాహనంపై కొత్తపాలెం నుంచి నరవ వైపు వెళ్తున్నన్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో వాహనం అదుపుతప్పి వెనుక చక్రాల కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలంలో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ అప్పలనాయుడు ప్రమాదానికి కారణాలను విచారించారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, బాబు ఉన్నారు. కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటనా స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. చివరికి రూ.6 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో ఆందోళన సద్దుమణిగింది. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.


ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు

‘ఉక్కు’ పరిరక్షణే ధ్యేయం

కూర్మన్నపాలెం: వేలమంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సాయపడుతున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే ధ్యేయంగా కార్మికులు పోరాటం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనికి కేంద్రం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 978వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కొనేందుకు కార్మికవర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు


కంచరపాలెం జంక్షన్ వద్ద డివైడర్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం : ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు స్ప్రింగ్ డివైడర్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి దాటాకా కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ వరకు పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు ఈ డివైడర్లు ఏర్పాటు చేసినట్టు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. ఈ క్రమంలో కంచరపాలెం, ఊర్వశి, ఐటీఐ, 104 ఏరియా, మర్రిపాలెం, కరాస జంక్షన్లలో ప్రమాదాలు జరగకుండా ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాహన చోదకులకు పలు సూచనలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ టీఎస్ మధ్య రోడ్డులో ట్రాఫిక్ విభజనకు వీలుగా ఈ స్ప్రింగ్ డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమా దాలు తగ్గుముఖం పట్టే అవకాశం వుందని తెలిపా రు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.